




పుట్టపర్తిలో జలమయమైన సత్యమ్మగుడి ప్రాంతం

వైసీపీ అడ్డగోలు నిర్ణయం..!



అనువుగానిచోట ప్రైవేటు ఫిట్‌నెస్ సెంటర్
సింగిల్ టెండర్‌తో ఓకే చేసిన గత ప్రభుత్వం
ఆ ప్రాంతంలో వర్క్‌షాపుకూడా లేని వైనం
రవాణాశాఖకు తెలియకుండానే తతంగం పూర్తి
మార్చాలంటూ వాహనదారుల వేడుకోలు

హిందూపురం, సెప్టెంబరు 29: గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో అనుయాయులకు ఆదాయాన్ని కట్టబెట్టేందుకు అడ్డగోలుగా నిర్ణయాలు తీసుకుందన్నది నిర్వివాదాంశం. ప్రజల అవసరాలుగానీ, బాధలుగానీ, కనీసం మానవీయంగా కూడా ఆలోచించిన పాపానపోలేదు. ఇందులో భాగంగానే రవాణా వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చే బాధ్యతలను ప్రైవేటుకు అప్పనంగా అప్పగిస్తూ రెండేళ్ల క్రితం జీఓ ఇచ్చింది. అది రవాణా వాహనాలకు అందుబాటులో ఉందా.. లేదా.. అని కూడా చూడలేదు. రెండో ఫేస్ టెండర్‌ను కూడా గుడ్డిగా ఇచ్చేసిందని రవాణా వాహనదారులు వాపోతున్నారు. ఈ టెండర్ దాఖలు చేశారనీ, ఓకే అయిందని రవాణాశాఖ అధికారులకు కూడా మూడు రోజుల క్రితం వరకు తెలియకపోవడం గమనార్హం. అంతేకాక సింగిల్ టెండర్‌కే అప్పటి ప్రభుత్వం అప్పజెప్పడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సింగిల్ టెండర్‌తో ఓకే..

ప్రైవేటు ఫిట్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు రెండేళ్ల క్రితం టెండర్లు పిలిచారు. ఇది అప్పట్లో రవాణాశాఖ అధికారులకు కూడా తెలియకపోవడం విడ్డూరం. జిల్లాలో బుక్కపట్నం వద్ద సెంటర్ ఏర్పాటుకు ఒకే టెండరు దాఖలైంది. టెండరుదారుడు అప్పట్లో వైసీపీ పెద్దలకు అనుకూలంగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గుట్టుగా అతనొక్కడితోనే టెండర్ వేయించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎకరా స్థలం ఉండాలి. టెండర్ వేసిన వ్యక్తి రెండెకరాలకుపైగా చూపించినట్లు తెలిసింది. మిగిలిన జిల్లాల్లో నలుగురైదుగురు టెండర్లలో పాల్గొన్నారు. ఇక్కడ మాత్రం ఒకరి పేరు మీదే ఇవ్వడం వెనుక మతలబు ఏంటని ప్రస్తుతం కూటమి నాయకులు ప్రశ్నిస్తున్నారు. రెండో దశలో కూడా ప్రభుత్వం ఓకే చెప్పడంతో ఇది పాలక పెద్దలకు తెలిసి జరుగుతోందా.. అధికారుల మధ్యనే సాగుతోందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. విషయాన్ని రవాణాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని వాహనదారులు అంటున్నారు. సింగిల్ టెండర్‌కే ఓకే చెప్పడం సబబుకాదనీ, దీనిపై కోర్టుకు వెళ్తామని కూటమి నాయకులతోపాటు వాహన యజమానులు అంటున్నారు.

అనువుగానిచోట..

రాష్ట్రంలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీ బాధ్యతలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ రెండేళ్ల క్రితం ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ప్రైవేటు ఫిట్‌నెస్ సెంటర్లు పెట్టాలన్న కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలిచింది. నిబంధనల ప్రకారం జిల్లా కేంద్రానికి 30 కి.మీ. పరిధిలో ఉండేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో బుక్కపట్నం వద్ద ప్రైవేటు వ్యక్తి స్థలాన్ని కొనుగోలు చేసి, ఫిట్‌నెస్ సెంటర్‌కు టెండర్ వేశాడు. ఈ ప్రాంతం రవాణా వాహనదారులకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆవర్గాలు వాపోతున్నాయి. జిల్లాలో రవాణా వాహనాలు 42వేలదాకా ఉన్నాయి. ఇందులో కాలంచెల్లిన వాహనాలు మినహాయిస్తే.. 35 వేలదాకా ఉన్నట్లు అధికారుల అంచనా. ఇందులో అత్యధికంగా రవాణా వాహనాలు హిందూపురంలోనే ఉన్నాయి. అంతేకాక జిల్లా రవాణాశాఖ కార్యాలయం కూడా హిందూపురంలోనే ఉంది. ఈ పరిస్థితుల్లో ఇక్కడ కాకుండా బుక్కపట్నంలో పెట్టడం ఎంతవరకు సమంజసమని రవాణా వాహనదారులు అంటున్నారు.

ఖర్చుతో కూడుకున్న కష్టం

జిల్లాలో 35వేల వరకు రవాణా వాహనాలుండగా ఇందులో 7వేలకుపైగా హిందూపురంలోనే ఉన్నాయి. ఇక మడకశిర, పెనుకొండ, పుట్టపర్తి కలుపుకుంటే 22వేల వాహనాలు హిందూపురం ఆర్టీఓ కిందే ఉన్నాయి. జిల్లాలో రవాణా వాహనం ఏదైనా మరమ్మతుకు వస్తే హిందూపురంగానీ, అనంతపురంగానీ వెళ్లాలి. రవాణా వాహనాల సంఖ్యను బట్టి చూస్తే రాష్ట్రంలోనే హిందూపురం 3.. 4 స్థానాల్లో ఉంటుంది. అలాంటపుడు హిందూపురంలో కాకుండా బుక్కపట్నంలో ఫిట్‌నెస్ సెంటర్ పెడితే అమరాపురం నుంచి బుక్కపట్నం వెళ్లాలంటే 130 కి.మీ. పైగా ప్రయాణించాలి. అక్కడికెళ్లాక మరమ్మతుల సమస్య ఉంటే హిందూపురం లేదా అనంతపురం వెళ్లాలి. అక్కడికి వెళ్లి రావాలంటే డీజిల్ ఖర్చే రూ.5వేలకుపైగా అవుతుంది. అది రవాణా వాహనదారుడికి పెనుభారంగా మారుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని వాహనాలు అత్యధికంగా ఉండటంతోపాటు, వాటి మెకానిక్‌లు ఎక్కువగా ఉన్న హిందూపురం ప్రాంతంలో ఫిట్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తే ఉపయోగంగా ఉంటుందని రవాణా వాహనదారులు అంటున్నారు.

మాన్యువల్‌కు ఫుల్‌స్టాప్

ప్రైవేటు ఫిట్‌నెస్ సెంటర్‌కు వస్తే హెవీ వెహికల్, కమర్షియల్ గూడ్స్, పాఠశాల, కళాశాల బస్సులు, తదితర వెహికల్స్‌కు ఎప్పటికప్పుడు ఫిట్‌నెస్ పరీక్ష చేసి, సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం వాహనానికి ఫిట్‌నెస్ పరీక్షలన్నీ మాన్యువల్‌గానే జరుగుతున్నాయి. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ స్వయంగా వాహనాన్ని నడిపి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇస్తున్నారు. ప్రైవేటు ఫిట్‌నెస్ సెంటర్లు అందుబాటులోకి వస్తే ఆటోమేటిడ్ మిషన్లు రానున్నాయి. అంతా ఆన్‌లైన్‌లోనే జరగనుంది. పూర్తిగా యంత్రం ద్వారానే పరీక్షిస్తారు. కంప్యూటరైజ్ సర్టిఫికెట్ జారీచేస్తారు. వాహనంలో సమస్య ఉంటే రిపేరీ చేసేదాకా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రాదు. దేశంలో రాజస్థాన్, మహారాష్ట్రలో మాత్రమే ఈ విధానం అమలులో ఉంది. అక్కడ ఆర్టీఏ అధికారుల భాగస్వామ్యం ఉంటుంది. మాన్యువల్‌తోపాటు ఆటోమేటెడ్ మిషన్లలో కూడా సరిచూశాకే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీచేస్తారు. రాష్ట్రంలో మాత్రం కేవలం యంత్రంమీదే ఆధారపడటం ఎంతవరకు సమంజసమని హెవీ వెహికల్ యజమానులు అంటున్నారు. కొన్ని సందర్భాల్లో సాంకేతికపరమైన సమస్యలు రావచ్చు. అయినా సర్టిఫికెట్లు పొందితే జరగరానిది జరిగితే బాధ్యత ఎవరిదనీ, ప్రభుత్వం ఆలోచించాలని వారు అభిప్రాయపడుతున్నారు. ఎంత ప్రైవేటు వ్యక్తులకు ఈ సెంటర్ అప్పగించినా రవాణాశాఖ అధికారుల ప్రమేయం ఉంటేనే మేలు చేకూరుతుందన్న అభిప్రాయాన్ని వాహనదారులు వ్యక్తం చేస్తున్నారు.

వర్క్‌షాపు లేని వైనం

ప్రభుత్వ నిర్ణయంతో వాహన యజమానులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బుక్కపట్నం వద్ద రవాణా వాహనాలకు సంబంధించి మెకానిక్ షెడ్లులేవు. ఆ ప్రాంతంలో ఒక్క వర్క్‌షాపు కూడా లేదని తెలిసి కూడా అక్కడికి ఫిట్‌నెస్ సెంటర్ ఇవ్వడం సబబుకాదంటున్నారు. జిల్లాలోనే అత్యధికంగా రవాణా వాహనాలున్నది హిందూపురంలోనే. అలాంటపుడు హిందూపురం, పెనుకొండ ప్రాంతాల్లో ప్రైవేటు ఫిట్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసి ఉండుంటే బాగుండేదనీ, ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించాలని వాహన యజమానులు కోరుతున్నారు. రెండో విడతలో టెండర్‌దారుడికి అనుమతి ఇవ్వరని రవాణాశాఖ అధికారులు భావించారు. వారికి కూడా తెలియకుండా ఓకే చేయడంతో సంబంధిత శాఖాధికారులు మిన్నకుండిపోయారు. ఏది ఏమైనా రవాణావాహనదారులకు ఆమోదయోగ్యమైన ప్రాంతంలో వాహనాల ఫిట్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

హమ్మయ్య.. వానొచ్చింది..

జిల్లావ్యాప్తంగా వర్షం
పుట్టపర్తి, హిందూపురంలో రోడ్లు జలమయం



పెనుకొండలో నారాయణమ్మ కాలనీకి వెళ్లే రహదారిలో నిలిచిన వర్షపునీరు



పిడుగుపాటుకు పాక్షికంగా దెబ్బతిన్న తనకల్లులోని షిరిడీసాయి ఆలయ గోపురం

కొత్తచెరువు, సెప్టెంబరు 29: జిల్లావ్యాప్తంగా ఆదివారం తెల్లవారుజామున వర్షం కురిసింది. హిందూపురం, పుట్టపర్తిలో దంచి కొట్టింది. రోడ్లు జలమయమయ్యాయి. పలు చోట్ల పిడుగులు పడ్డాయి. గోరంట్ల మండలం దిగువగంగంపల్లి తండాలో పిడుగుపడి ఇద్దరు మరణించగా.. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. తనకల్లులోని షిరిడీసాయిబాబా గుడి గోపురంపై ఆదివారం తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో పిడుగు పడింది. గోపురం పాక్షికంగా (కొద్దిగా) దెబ్బతింది. సిమెంటు లెచిపోయింది. చుట్టూ ఉన్న గోడలు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

రోడ్లు జలమయం

పుట్టపర్తిలో భారీ వర్షం కురిసింది. అత్యధికంగా 64.6మి.మీ., వర్షపాతం నమోదైంది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. సత్యమ్మ గుడి ప్రాంతంలో భారీగా నీరుచేరి, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొత్తచెరువులో తెల్లవారుజామున 4గంటల నుంచి 8గంటల వరకు వర్షం కురిసింది.

వర్షపాతం నమోదు ఇలా..

జిల్లాలో పుట్టపర్తి 64.6, హిందూపురం 40.2, పెనుకొండ 39.6, తనకల్లు 34.2, సోమందేపల్లి 32.6, బుక్కపట్నం 29.6, నల్లచెరువు 28.8, చిలమత్తూరు 26.2, కొత్తచెరువు 24.2, అమరాపురం 19.6, రొద్దం 19.4, గోరంట్ల 18.2, పరిగి 15.6, ధర్మవరం 13.6, లేపాక్షి 10.2, అగళి 8.4, కదిరి 8.2, మడకశిర 6, అమడగూరు 5.6, గుడిబండ 5.2, ఓబుళదేవరచెరువు 5.2, రొళ్ల 4.6, నల్లమాడ 2.2, బత్తలపల్లిలో 1.4 మి.మీ. వర్షం కురిసినట్లు గణాంకాల అధికారి గంగాద్రి ప్రకటనలో తెలిపారు.

వైద్యం కోసం..



పాపను పరీక్షిస్తున్న వైద్యుడు



తల్లితో చిన్నారి

అనారోగ్యం బారిన పడితే మెరుగైన వైద్యం కోసం నగరాలకు, అత్యాధునిక వైద్యశాలలకు వెళ్తారు. డబ్బున్న వారైతే విదేశాలకు వెళ్తారు. హిందూపురంలో ఇందుకు భిన్నంగా జరిగింది. వైద్యం కోసం ఏకంగా గల్ఫ్ దేశం ఒమన్ మస్కట్ నుంచి పురానికి వచ్చారు. హిందూపురం ఆర్టీసీ కాలనీకి చెందిన రిజ్వాన్ మస్కట్‌లోని ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈనెల 7వ తేదీన అతడి భార్య అయిషా, 6 సంవత్సరాల కుమార్తె ఫాతిమా మస్కట్ వెళ్లారు. ఫాతిమాకు తీవ్ర తలనొప్పి వచ్చింది. వారు మస్కట్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. అక్కడి వైద్యులు సీటీ స్కాన్ చేసి, పాపకు మెదడులో రక్తం గూడు కట్టిందనీ, వెంటనే ఆపరేషన్ చేయాలని తెలిపారని అయిషా చెప్పారు. దీంతో భయపడిన తల్లిదండ్రులు హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో పనిచేసే చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ శివకుమార్‌కు స్కానింగ్, మెడికల్ రిపోర్టులు వాట్సాప్ ద్వారా పంపారు. డా. శివకుమార్ వాటిని పరిశీలించి, బిడ్డకు రక్తం తక్కువగా ఉండడంతో తలనొప్పి వచ్చిందని భయపడాల్సిన అవసరం లేదని సూచించారు. వారు ఈనెల 27వ తేదీన హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. పరీక్షలు చేసి రక్తం ఎక్కించారు. పాప పూర్తిగా కోలుకుంది. దీంతో తల్లి ఆనందానికి అవధుల్లేవు.

-హిందూపురం అర్బన్

2న సత్యాగ్రహ దీక్ష



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి

ధర్మవరం, సెప్టెంబరు 29: మున్సిపల్ టీచర్ల సమస్యల పరిష్కారం కోరుతూ అక్టోబరు 2న సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. యూటీఎఫ్ స్థానిక కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. శెట్టిపి మాట్లాడుతూ... మున్సిపల్ హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత ఉందన్నారు. 3, 4, 5 తరగతులను విలీనం చేశారే తప్ప.. ఆ తరగతులను బోధించడానికి స్కూల్ అసిస్టెంట్లను ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్ల తరహాలో మున్సిపల్ టీచర్లకు అర్బన్ ఎంఈఓ పోస్టులు ఇవ్వాల్సి ఉందన్నారు. సమస్యలపై నిత్యం విన్నవిస్తున్నా పట్టించుకుంననే వారు లేరన్నారు. దీంతో సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నామన్నారు. సమావేశంలో యూటీఎఫ్ ప్రధానకార్యదర్శి సుధాకర్, గౌరవాధ్యక్షుడు భూతన్న, కోశాధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పింఛన్ నిధులు విడుదల

పుట్టపర్తి, సెప్టెంబరు 29: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా కింద 2,67,230 మంది లబ్ధిదారులకు రూ.114.73 కోట్ల నిధులు విడుదలైనట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆ సొమ్మును బ్యాంకు నుంచి సోమవారం డ్రా చేసి, ఆయా సచివాలయాలకు పంపుతామన్నారు. అక్టోబరు 1న ఉదయం 6 గంటలకు ఆయా సచివాలయాల సిబ్బంది ద్వారా పింఛన్ల పంపిణీ చేపడతామన్నారు.



పాడి ఆవుల కళేబరాలు



రైతు దంపతుల మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

భారీ వర్షం..
అప్పుడే తెల్లారిపోయింది..
పశువుల పాకవైపు
రైతు దంపతులు పరుగున వెళ్లారు..
పాక ఊడ్చే పనికి భర్త నిమగ్నమయ్యాడు..
పాలు పితికేందుకు భార్య ఉపక్రమించింది..
అందుకు అవసరమైన చెంబుతో
కొడుకు వడివడిగా వస్తున్నాడు..
అంతే.. భారీ శబ్దం..
ఏమీ కనబడనంత వెలుతురు..
ఆ క్షణం తర్వాత..
అంతా శూన్యం..
బతుకు పోరాటంలో ఉన్న..
ఆ ముగ్గురూ..
అచేతన స్థితిలో పడిపోయారు..
ఉలుకూ.. పలుకూ లేదు..
పక్కనే ఉన్న పాడి ఆవులు
ప్రాణం విడిచాయి..
ఆ పేదింటిపై పిడుగు పడింది..
కకావికలం చేసింది..
రైతు దంపతులు లోకాన్ని వీడారు..
కొడుకు మృత్యువుతో పోరాడుతున్నాడు..
ఇంట్లో ఉన్న అతడి భార్య పిల్లలు..
కన్నీటిపర్యంతమవుతున్నారు..
నడిపించేవారు లేరు..
అన్నంపెట్టే ఆవులూ లేవు..
ఆగని కన్నీళ్లు..
శూన్యమైన బతుకు తప్ప..

అయ్యో.. దేవుడా..!

- పేదింటిపై పిడుగు
- రైతు కుటుంబం కకావికలం
- దంపతులు మృతి..
- కుమారుడి పరిస్థితి విషమం



గోరంట్ల, సెప్టెంబరు 29: ఒక్క పిడుగు పేద రైతు కుటుంబాన్ని కకావికలం చేసింది. రైతు దంపతులను పొట్టనబెట్టుకుంది. వారి కుమారుడిని ఆస్పత్రి పాల్జేసింది. ఆ ఇంటికి ఆధారమైన పాడి ఆవుల ప్రాణం తీసింది. మండలంలోని దిగువగంగంపల్లి తండాలో ఆదివారం ఉదయం పిడుగుపడి దంపతులు దశరథనాయక్ (48), దేవీబాయి (45) మృతిచెందగా, వారి కుమారుడు జగదీశ్‌నాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో రెండు పాడి ఆవులు కూడా మరణించాయి. దశరథనాయక్ తనకున్న మూడెకరాల పొలంలో పంటలు సాగుచేసుకుంటుంటేవాడు. మూడు ఆవులను సైతం కొనుగోలు చేశాడు. వాటిని మేపుతూ, పాలు అమ్ముకుంటూ జీవనం సాగించేవాడు. కుమారుడు, కుమార్తె సంతానం. కుమార్తె నందినీబాయికి వివాహం చేసి పంపారు. కుమారుడు జగదీశ్ నాయక్‌కు సుహానీబాయితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. అందరూ కలిసి ఉండేవారు. ఆదివారం ఉదయం గ్రామంలో భారీ వర్షం కురిసింది. దశరథనాయక్, దేవీబాయి దంపతులు ఇంటిముందున్న పాకలో ఆవుల నుంచి పాలు పితికేందుకు వెళ్లారు. అందుకు అవసరమైన చెంబుతో కుమారుడు జగదీశ్ నాయక్ వెనకాలే వస్తున్నాడు. అతడు తీసుకుని, బయటకు రాగానే సమీపంలో పిడుగు పడింది. దాని ధాటికి దంపతులు స్పృహలేకుండా పడిపోయారు. రెండు ఆవులు చనిపోయాయి. సమీపంలోనే ఉన్న జగదీశ్ నాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టుపక్కలవారు వెంటనే ముగ్గురిని ఆటోలో పెడబల్లి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే దేవీబాయి, దశరథనాయక్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాలను స్వగ్రామానికి తరలించారు. జగదీశ్ నాయక్ పరిస్థితి విషమంగా ఉంది. అతడిని పుట్టపర్తికి తరలించారు. అక్కడి నుంచి అనంతపురానికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమయంగా ఉండడంతో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. కాలు, చేయి పనిచేయని స్థితిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. సీఐ శేఖర్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టంకి తరలించారు. ప్రమాదంపై దర్యాప్తు చేపట్టారు. ప్రమాద స్థలాన్ని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, జిల్లా పశువైద్యాధికారి శుభదాస్ పరిశీలించారు. సోమందేపల్లి పశువైద్యాధికారి బాలాజీనాయక్, అసిస్టెంట్ తులసీరాం పాడిఆవులకు గ్రామ సమీపంలో పోస్టుమార్టం నిర్వహించారు.

ఆదుకుంటాం: కలెక్టర్

పిడుగుపాటుతో మరణించిన కుటుంబాన్ని ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. మృతులు ఒక్కొక్కరికి రూ.4లక్షలు ఎక్స్‌గ్రేషియా అందజేస్తామన్నారు. గాయపడిన జగదీశ్ నాయక్‌కు రూ.50వేలు ఆర్థికసాయం చేస్తామన్నారు. మరణించిన రెండు ఆవులకు రూ.37,500 చొప్పున పరిహారం అందజేస్తామని కలెక్టర్ తెలిపారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో వైద్యుల పాత్ర కీలకం

మంత్రి సత్యకుమార్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం, సెప్టెంబరు 29: ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో వైద్యుల పాత్ర కీలకమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఐఎంఏ ఏపీ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశానికి మంత్రి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ప్రతి వైద్యుడు కృషి చేయాలన్నారు. వైద్య వృత్తిని సామాజికబాధ్యతగా భావించాలన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులను ఆధునికీకరించి, మెరుగైన సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తామన్నారు. వైద్యుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వైద్యులు.. పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాటిని సీఎం చంద్రబాబు నాయుడుతో చర్చించి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్రనాయుడు, ప్రధాన కార్యదర్శి ఫణిధర్, నాయకులు డాక్టర్ నందకిశోర్, డాక్టర్ రవికృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర



పుట్టపర్తి, సెప్టెంబరు 29: స్థానిక చిత్రావతి రోడ్డులో గంగమ్మ ఆలయాన్ని పునర్నిర్మించి 40 రోజులు అయిన సందర్భంగా ఆదివారం జాతరను వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని వందలాది మంది మహిళలు డప్పువాయిద్యాల మధ్య ఊరేగింపుగా వెళ్లి గంగమ్మకు బోనాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేయించారు. మొక్కులు చెల్లించుకున్నారు.

విస్తృత వ్యాఖ్యానమే విమర్శ

● ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి



మట్టిపూలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 29: బాధాసర్పద్రష్టులైన ప్రజల జీవిత మూలాలను సూత్రప్రాయంగా వ్యక్తీకరించిన కవుల కవిత్వాన్ని విస్తృతమైన వ్యాఖ్యానంతో పాఠకునికి చేరవేయడమే కవిత్వ విమర్శ అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో సీనియర్ కవి తూముచెర్ల రాజారామ్ రచించిన 'మట్టి పూలు' పుస్తక ఆవిష్కరణ సభను స్పందన అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి అధ్యక్షతన నిర్వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, బండి నారాయణస్వామి ముఖ్యఅతిథులుగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాయలసీమలో నివసిస్తున్న కవులందరూ రాయలసీమ కవులు కాదని, రాయలసీమ గురించి కవిత్వం రాసిన కవులే రాయలసీమ కవులని అభిప్రాయపడ్డారు. కవుల కవితాంతరంగాన్ని మట్టిపూలుగా సృజించిన విమర్శకవి రాజారామ్ అభినందనీయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ కవి రాధేయ, డాక్టర్ నాగేశ్వరాచారి, అంకె శ్రీనివాస్, తరిమెల అమరనాథరెడ్డి, టీవీ రెడ్డి, అశ్వత్థరెడ్డి, డాక్టర్ ప్రగతి, సుప్రియ, కృష్ణమూర్తి, సురేష్, పూజారి ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

బియ్యంతో పాటు... కందిపప్పు, చక్కెర

● మూడు కిలోల జొన్నలు కూడా..
● రేపటి నుంచి పంపిణీకి సిద్ధం



రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 29: కార్డు లబ్ధిదారులకు శుభవార్త. ఈనెల కోటాకు సంబంధించి అక్టోబరు 1 నుంచి రేషన్ సరకులు పంపిణీ చేపడుతున్నారు. జూన్ నెల నుంచి సెప్టెంబరు వరకు బియ్యం మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. డీలర్లమార్పుతో చాలా మంది లబ్ధిదారులకు బియ్యం కూడా సక్రమంగా అందలేదు. ఈసారి బియ్యంతో పాటు కందిపప్పు, చక్కెరకూడా రేషన్ సరకుల్లో పంపిణీ చేయనున్నారు.జొన్నలు కావాలంటే కనీసం మూడు కిలోల వరకు బియ్యం తగ్గించుకొని జొన్నలు ఇస్తామని అధికారులు ప్రకటించారు.

● **అసలేం జరిగిందంటే..**

టీడీపీ కూటమి ప్రభుత్వం జూన్‌లో బాధ్యతలు చేపట్టింది. ఆ నెలలో రేషన్ సరకుల పంపిణీపై దృష్టిపెట్టకపోవడంతో పాత డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. జూలై నెలలో సీఎం చంద్రబాబునాయుడు చౌకడిపోల ద్వారా బియ్యంతో పాటు కందిపప్పు, చక్కెర, నూనె వంటి సరకులు పేదలకు రాయితీతో అందించాలని ఆదేశించారు. ఆ మేరకు ఆ గస్టు నుంచే బియ్యంతో పాటు చక్కెర, కందిపప్పు అందించాల్సి ఉంది. బియ్యం అందించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. రేషన్ డీలర్ల మార్పుతో పాతబఫర్ స్టాక్ చూపించకపోవడంతో అరకొరగానే అందడంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అక్టోబరు 1 నుంచి చేపట్టే పంపిణీలో కార్డుదారులకు బియ్యంతో పాటు కందిపప్పు, చక్కెర అందజేయనున్నారు. జిల్లాలో అధికారిక లెక్కల మేరకు 6,67,263 రేషన్‌కార్డులు ఉన్నాయి. 1645 చౌకడిపోలు ఉన్నాయి. వీరికి ప్రతినెలా 9,716 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతుంది. బియ్యంతో పాటు ఇతర సరకులు స్టాక్ పాయింట్ల నుంచి చౌకడిపోలకు సరఫరా చేశారు. కందిపప్పు 410 మెట్రిక్ టన్నులు కేటాయించారు. ఒక్కోకార్డుదారుడికి అర కిలో చక్కెర ఇస్తారు. 1వతేదీ నుంచి పంపిణీకి యంత్రాంగం సిద్ధమైంది. అయితే ఈసారి గోదుమపిండి ఇవ్వడంలేదు.



అందరికీ కందిపప్పు

ఈనెల నుంచి లబ్ధిదారులకు కందిపప్పు పంపిణీ చేస్తాం. జిల్లాకు 410 మెట్రిక్ టన్నుల కందిపప్పు కేటాయించారు. ఇప్పటికే వాహనాలలో సరకు జిల్లాకు వస్తోంది. అక్టోబరు 1న బియ్యంతో పాటు కిలో కందిపప్పు, అరకిలో చక్కెర ఇస్తున్నాం. జొన్నలు కావాలంటే మూడు కిలోలు ఇస్తాం. కందిపప్పు అందలేదని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. తొలుత బియ్యం తీసుకున్నా పంపిణీ ముగిసేలోగా ప్రతి ఒక్కరికీ అందిస్తాం.

: రమేష్‌రెడ్డి, డీఎం, పౌరసరఫరాల శాఖ

● **ఒక్కో కార్డుకు మూడు కిలోల జొన్నలు**

పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో గత కొంతకాలంగా రాగులు, రాగిపిండి ఇస్తూవచ్చారు. ఈసారి జొన్నలు ఇవ్వాలని నిర్ణయించారు. బియ్యంతో పాటు కావాల్సిన వారికి 3 కిలోల వరకు జొన్నలు ఇస్తారు. బియ్యం కోటాలో తగ్గించుకుని మూడు కిలోల వరకు జొన్నలు ఇస్తారు. జిల్లాకు రెండు వేల టన్నుల జొన్నలు వచ్చాయి.

భార్య గొంతు కోసిన భర్త



జ్యోతి (ఫైల్)

గుమ్మఘట్ట, సెప్టెంబరు 29: కట్టుకున్న భర్త కాలయముడయ్యాడు. భార్యను గొంతు కోసి అతి కిరాతకంగా హతమార్చిన సంఘటన గుమ్మఘట్ట మం డలం కలుగోడు గ్రామంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గలగల గ్రామానికి చెందిన బోయ వన్నూరుస్వామి తన భార్య జ్యోతి(28)ని అతి దారుణంగా గొంతుకోసి పరారయ్యాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. బోయ వన్నూరుస్వామికి ఎనిమిదేళ్ల క్రితం కలుగోడు గ్రామానికి చెందిన నరసింహప్ప, కాలమ్మ కూతురు జ్యోతినిచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కూతుర్లు, ఓ కుమారుడు ఉన్నారు. దంపతుల మధ్య గొడవ జరగడంతో నెల రోజులుగా జ్యోతి పుట్టినిల్లు కలుగోడులో ఉంటోంది. తన వెంట రెండు కత్తులను దాచుకొని శనివారం రాత్రి భార్య వద్దకు చేరుకొని నమ్మించి పక్కన చేరి నిద్రించాడు. అర్ధరాత్రి భార్య జ్యోతి నోట్లో గుడ్డ పెట్టి గొంతుకోశాడు. బయట వరండాలో నిద్రిస్తున్న తల్లి కాలమ్మ సోదరులు దొనప్ప ఇంట్లో అలజడి శబ్ధం విని చూసేలోగా జ్యోతి జీవచ్ఛవంలా రక్తపుమడుగుల్లో కనిపించింది. వన్నూరుస్వామిని ప్రతిఘటించి కత్తితో పొడిచే ప్రయత్నం చేయగా వారు దూరం జరిగారు. వెంటనే తలుపులు తెరిచి పరారైనట్లు వారు తెలిపారు. సంఘటనపై కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, సీఐ వెంకటరమణ సంఘటనాస్థలానికి చేరుకొని జ్యోతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

పాపం.. చిన్నారులు



తల్లి చిన్నారులను వదిలి పుట్టినిల్లు కలుగోడులో నెలరోజులుగా ఉంటుండగా చిన్నారులు శాంతమ్మ, వరలక్ష్మి, మా రన్న గలగల సమీపంలోని తోటలో అవ్వతాతల వద్ద ఉం టున్నారు. తల్లి జ్యోతిని తండ్రి వన్నూరుస్వామి గొంతు కోసి హతమార్చి పరారవడంతో చిన్నారులను ఇకపై ఎవరు సంరక్షిస్తారో అంటూ వారి బంధువులు, కుటుంబసభ్యులు ఆవేదన చెందుతున్నారు. చిన్నారులు తల్లిని కోల్పోగా తండ్రి జైలుకు వెళితే పిల్లల పరిస్థితి ఏమిటని కుటుంబసభ్యులు కన్నీరు పెడుతున్నారు.

ముగిసిన వివాదం

● ఏకమైన మూడు పార్టీలు
● పరిటాల ఇంట చర్చలు

ధర్మవరం, సెప్టెబరు 29: ధర్మవరం మున్సిపల్ కమిషనర్ నియామకంపై ఎన్డీఏ కూటమిలో నెలకొన్న విభేదాలు తీవ్ర స్థాయిలో భగ్గుమన్నాయి. తెలుగుదేశంపార్టీ అభిప్రాయానికి భిన్నంగా బీజేపీ నాయకత్వం వ్యవహరించడమే రాద్ధాంతానికి కారణం. వైసీపీతో అంటకాగిన కమిషనర్‌ను నియమించడంతో టీడీపీలో ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకున్నాయి. నెలరోజులుగా వివాదం నడుస్తుండగా మంత్రి సత్యకుమార్ సైతం కమిషనర్‌ను వెనుకేసుకుని రావడం అగ్గికి ఆజ్యం పోసినట్లయింది. దీంతో టీడీపీ శ్రేణులంతా ఏకమై ఎన్డీఏ కార్యాలయం ముందే ధర్నాకు దిగడంతో ఇది కాస్తా రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. మంత్రి సత్యకుమార్‌ను సైతం అడ్డగించి కాన్వాయ్‌ను కదలకుండా చేశారు. తమ పార్టీ పైస్థాయి నుంచి ఎక్కడ ఇబ్బంది కలుగుతాయోనన్న ఆందోళన సత్యకుమార్ వర్గీయుల్లో వ్యక్తమైనట్లు తెలుస్తోంది. శనివారం టీడీపీ శ్రేణులు భారీ ఎత్తున నిర్వహించిన ధర్నాతో ఉలిక్కిపడిన బీజేపీ అధిష్టానం దిద్దుబాటు చర్యలు చేపట్టినట్లు సమాచారం. అదే రోజు రాత్రే అనంతపురంలోని పరిటాల ఇంట్లో అంతర్గతంగా సమావేశం నిర్వహించి భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ చర్చల పట్ల మూడు పార్టీలు సానుకూలంగా వ్యవహరించడంతోపాటు ప్రస్తుత వివాదాస్పద కమిషనర్‌ను సరెండర్ చేయాలన్న ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే మూడు పార్టీల నాయకులు ధర్మవరంలో మీడియా ముందుకు వచ్చి తామంతా ఒక్కటేనని, చిన్నచిన్న సంఘటనలు జరుగుతుంటాయని, సర్దుకుపోతాయంటూ మాట్లాడారు.

ఈ ఐక్యత కొనసాగేనా..?

ఎన్డీఏ కూటమిలో టీడీపీ, బీజేపీ వర్గాల మధ్య నెలకొన్న విభేదాలు తీవ్ర స్థాయిలో ముదరడం, చివరికి మంత్రి సత్యకుమార్‌యాదవ్ జోక్యం చేసుకోవడంతో బ్రేక్ పడింది. వీరి మధ్య విభేదాలు పూర్తిగా సమసిపోయాయా..? తాత్కాలికమేనా అన్న సందేహాలు కలుగుతున్నాయి. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మూడు పార్టీల మధ్య అంతర్గత విభేదాలు మొదలయ్యాయి. తమకు విలువ లేకుండా చేస్తున్నారంటూ టీడీపీ వర్గీయులు నేరుగా బీజేపీ కార్యాలయానికివెళ్లి కిందిస్థాయి సిబ్బందితో చర్చలు జరిపారు. ఇదే సమయంలో వివాదాస్పద కమిషనర్ మల్లికార్జునను నియమించుకోవడంతో అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. కమిషనర్‌ను మున్సిపల్ కార్యాలయంలోకి రానివ్వకుండా టీడీపీ వర్గీయులు అడ్డుకుంటూ వస్తున్నారు. కమిషనర్ బాధ్యతగా పనిచేసే వ్యక్తి అని, రాజకీయ విమర్శలు వస్తుంటాయని, అటువంటివి పట్టించుకోబోమని, అతనే కొనసాగుతాడంటూ పాత్రికేయ సమావేశంలో మంత్రి పేర్కొనడంతో టీడీపీ శ్రేణులు అగ్గిమీద గుగ్గిలమయ్యాయి. దీంతో బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించి, రోడ్డుపై ధర్నా చేయడంతో అది కాస్తా రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. సమస్యలు తొలగిపోయాయని మూడు పార్టీల నాయకులు బాహాటంగా చెబుతున్నప్పటికి ఇది తాత్కాలికమా లేదా ఐదేళ్లు కొనసాగుతుందా అన్నది ఆసక్తి రేపుతోంది.



మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్, చిలకం మధుసూదన్‌రెడ్డి, సందిరెడ్డి శ్రీనివాసులు

కూటమిలో విభేదాల్లేవ్

● మున్సిపల్ కమిషనర్‌తో గతంలో ఇబ్బందులు పడ్డాం
● పరిశీలిస్తామని సత్యకుమార్ చెప్పారు: పరిటాల శ్రీరామ్

ధర్మవరం, సెప్టెంబరు 29: ధర్మవరం కూటమిలో ఎలాంటి విభేదాలులేవని, మూడు పార్టీల లక్ష్యం నియోజకవర్గ అభివృద్ధి అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని, కమిషనర్ నియామకంపై తమకు అభ్యంతరాలు ఉన్నాయన్నారు. గతంలో ఆయన కమిషనర్‌గా పనిచేసిన సమయంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించి టీడీపీ నేతలను ఇబ్బంది పెట్టారని, ఇదే అంశాన్ని మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. ఈ విషయాలు ఏవీ తనకు తెలియవని సత్యకుమార్‌కు చెప్పినట్టు వివరించారు. అన్ని అంశాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు చెప్పారన్నారు. ఎన్నికల ముందు తాము ఎలా కలిసి ఉన్నామో ఇప్పుడు అలాగే కలిసి ఉన్నామని స్పష్టం చేశారు. ధర్మవరాన్ని అభివృద్ధి చేయడమే తమ ముందున్న లక్ష్యం అన్నారు. మొదట ఆరునెలలు చిన్న చిన్న సంఘటనలు ఉంటాయని, అధికారులు, నాయకులంతా సమన్వయం చేసుకోవడానికి సమయం పడుతుందన్నారు. గతంలో జరిగిన భూకబ్జాలు, అక్రమాలు గురించి సత్యకుమార్‌కు చెప్పామని, వాటిన్నింటిపై చర్యలు ఉంటాయన్నారు. చిలకం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ నియామకం ఉద్దేశ్యపూర్వకంగా జరిగిందికాదని, దీనిని అడ్డుపెట్టుకుని తమ మధ్య విభేదాలు ఉన్నట్టు చిత్రీకరిస్తున్నారన్నారు. కమిషనర్ గతంలో తమ వాళ్లను ఇబ్బంది పెట్టారని, కార్యకర్తలు, నాయకులకు ఆయన రావడం ఇష్టం లేదన్నారు. సందిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి పార్టీల మధ్య విభేదాలు, అపోహలు వస్తే చూసి సంతోషించే వారు చాలా మంది ఉన్నారని అన్నారు. తాము వారికి అలాంటి అవకాశం ఇవ్వబోమన్నారు. కచ్చితంగా పునరాలోచించి కమిషనర్ అంశంపై తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, నాయకులు పరిశే సుధాకర్, పురుషోత్తంగౌడ్, మహేశ్‌చౌదరి, ఫణికుమార్, సంధారాఘవ, ప్రసాద్‌నాయుడు, నాగూర్‌హుస్సేన్, మాధవరెడ్డి, ఆది, పురుషోత్తం పాల్గొన్నారు.

ఈతకెళ్లి బాలుడి మృతి



మృతిచెందిన హర్షవర్ధన్

తాడిపత్రి, సెప్టెంబరు 29: మండలంలోని సజ్జలదిన్నె వద్ద పెన్నానది సమీపంలో ఉన్న నీటిగుంతలో పడి అదే గ్రామానికి చెందిన హర్షవర్దన్ (15) ఆదివారం మృతిచెందాడని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. కళ్యాణదుర్గం మండలం మొలకాపురం గ్రామానికి చెందిన ఉమాశంకర్, సుమలత దంపతులు కొన్నేళ్ల క్రితం ఉపాధినిమిత్తం సజ్జలదిన్నెకు వచ్చారు. సమీపంలోని నాపరాళ్ల పరిశ్రమలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు హర్షవర్దన్. ఆదివారం స్నేహితులతో కలిసి ఈత కొట్టడానికి పెన్నానది ప్రాంతంలో ఉన్న నీటిగుంత వద్దకు వెళ్లాడు. ఈత నేర్చుకుంటుండగా గుంతలు ఉండడంతో హర్షవర్దన్ లోపలికి వెళ్లాడు. గమనించిన తోటి స్నేహితులు గట్టిగా కేకలు వేశారు. సమీపంలోని తోటల యజమానులు నీటిగుంతలోకి దిగి హర్షవర్దన్‌ను బయటకు తీశారు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు.

వ్యాన్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

● 11 మందికి గాయాలు





ప్రమాదంలో దెబ్బతిన్న వ్యాన్ వెనుకభాగం, ట్రావెల్స్ బస్సు

గార్లదిన్నె, సెప్టెంబరు 29: మండలంలోని తలగాసిపల్లి క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున వ్యాన్‌ను వెనుక నుంచి ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో 11 మంది గాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా బోసుపూర్ మండలం కొత్తకోటపాళ్యం గ్రామానికి చెందిన గౌతమ్ కుమార్, జ్యోతి దంపతులు స్వగ్రామం నుంచి కూ లీలను పనుల నిమిత్తం బెంగళూరుకు తీసుకెళ్తుండేవారు. అందులో భాగంగా గౌతమ్‌కుమార్, జ్యోతి 11 నెలలు క్రితం సుమారు 25 మం ది కూలీలను బెంగళూరులో అపార్టుమెంట్, రోడ్ల నిర్మాణ పనులకు తీసుకెళ్లారు. దసరా పండుగ దగ్గర పడుతుండడంతో అందరూ స్వగ్రామానికి శనివారం రాత్రి బెంగళూరు నుంచి వ్యాన్‌లో బయల్దేరారు. ఆదివారం తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో గార్లదిన్నె మండలం తలగాసిపల్లి క్రాస్ వద్దకు రాగానే బెంగళూరు నుంచి హైదారాబాద్ వైపు వెళ్తున్న ఏపీఎం ట్రావెల్స్ బస్సు వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టింది. వ్యాన్‌లోని గౌతమ్‌కుమార్, జ్యోతి, లక్ష్మి, జయమ్మ, శ్రీనాథ్, చంద్రాయుడు, బస్సు క్లీనర్ ప్రమోద్, మరో నలుగురు గాయపడ్డారు. ఎస్ఐ మహమ్మద్ గౌస్.. సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకుని, గాయపడిన వారిని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బస్సులో సుమారు 50 మంది ప్రయాణికులు ఉండగా.. వారంతా క్షేమంగా బయటపడ్డారు. బస్సు డ్రైవర్ నవీన్ పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

కరాటే జట్టు ఎంపిక



ఎంపికైన ఉమ్మడి జిల్లా కరాటే జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 29: ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్-19 కరాటే క్రీడాకారులను ఎంపిక చేశారు. కరాటే క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్-19 ఉమ్మడి జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ ప్రకటించారు. కరాటే బాలుర విభాగంలో రియాజ్, షాబాజ్, మోహన్‌కృష్ణ, హరీష్, లోకేష్ ఎంపిక కాగా...బాలికల్లో బరీరా, నిఖిత, సిరి, నస్రీన్, మదిహా ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు మొదటి వారంలో రాజంపేటలో నిర్వహించే ఎస్‌జీఎఫ్-19 రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారు.

పాలకుల స్వభావం మారితేనే సమసమాజం

● లెనిన్ శతవర్ధంతి సభలో వీకే రామచంద్రన్



లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీకే రామచంద్రన్, వామపక్ష నాయకులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 29: అధికార మార్పిడి జరిగినంత మాత్రాన సమసమాజ స్థాపన సాధ్యం కాదని, పాలకవర్గ స్వభావంలోనే మార్పు రావాలని కేరళ ప్రభుత్వ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు ఆచార్య వీకే రామచంద్రన్ పేర్కొన్నారు. లెనిన్ శతవర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్రంలో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'రాజ్యం-విప్లవం' అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు రామచంద్రన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేటి పెట్టుబడిదారీ వ్యవస్థలో పేద, ధనికుల మధ్య అంతరాలు అనివార్యమని కారల్ మార్క్స్, లెనిన్ ఆనాడే తమ రచనల ద్వారా తెలియజేసారని గుర్తుచేశారు. పాలకవర్గాలన్నీ పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడేందుకే పనిచేస్తాయని పేర్కొన్నారు. అందుకే ఈ సమాజంలో ఆర్థిక అసమానతలు అధికమని వివరించారు. స్వాతంత్ర్యానికి పూర్వం సమసమాజ భావనలే అధికంగా ఉండేవన్నారు. క్రమంగా బడా పెట్టుబడి, భూస్వామ్య లక్షణాలు పెరిగాయన్నారు. 1991లో సరళీకరణ ఆర్థిక విధానాలు అమలు చేయడం ప్రారంభించాక మరింత వేగవంతమయ్యాయన్నారు. దీనికి మతతత్వం కూడా తోడైందని తెలిపారు. అప్పటి నుంచి ఆర్థిక అంతరాలు మరింతగా పెరుగుతూ పోతున్నాయన్నారు. ప్రతి నలుగురు చిన్నారుల్లో ముగ్గురికి సరైన పౌష్టికాహారం లభించడం లేదని తెలిపారు. కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ అంతరాలు పోవాలంటే పాలకవర్గాల స్వభావం మారాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో లెనిన్ ఆలోచనలను మరోమారు పునరుచ్ఛరణ చేసుకోవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావి త్రి, డాక్టర్ భానుకిరణ్, ఎస్ఎం బాషా, గోవిందరాజులు, సత్యబోస్, నాగేంద్రకుమార్, రాజమోహన్, రమణయ్య, సతీష్, రంగనాయకులు, సత్యనారాయణరెడ్డి, రామాంజనేయులు, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటనారాయణ, రామిరెడ్డి, పరమేష్, జ యచంద్ర, శ్రీదేవి, రమకృష్ణారెడ్డి, మనోహర్, ఇర్ఫాన్, శ్యామల పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు రూ.17వేలు ఆర్థికసాయం: కేరళలోని వయనాడ్ వరద బాధితుల సహాయార్థం విద్యార్థుల నుంచి సేకరించిన రూ.17వేల చెక్కును కేరళ ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ పేరిట కేరళ రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వీకే రామచంద్రన్‌కు సమాజక్రాంతి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు అందజేశారు. దీనికి వీకే రామచంద్రన్ స్పందిస్తూ తాను కేరళ ముఖ్యమంత్రిని నేరుగా కలిసి ఈ చెక్కును అందజేస్తానని తెలిపారు.

సొమ్ము స్వాహాపై ఫిర్యాదు

● డీఆర్‌డీఏ ఉద్యోగులపై ఎఫ్ఐఆర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 29: పలువురు డీఆర్‌డీఏ-వెలుగు ఉద్యోగులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన 'స్వాహా సొమ్ము అంతేనా' కథనానికి డీఆర్‌డీఏ-వెలుగు అధికారులు స్పందించారు. ఈ మేరకు కళ్యాణదుర్గం ఏరియా కోఆర్డినేటర్ రాధారాణి అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కళ్యాణదుర్గం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇందులో డీఆర్‌డీఏ-వెలుగు సిబ్బంది లక్ష్మీనరసమ్మ, ఎర్రిస్వామి, వరలక్ష్మి, హనుమంతరాయుడు, లక్ష్మీదేవిని నిందితులుగా చేర్చారు. కళ్యాణదుర్గం మండలం మల్లికార్జునపల్లిలో నరసింహస్వామి గ్రామైక్య సంఘంలో 22 స్వయం సహాయక సంఘాల్లో స్త్రీనిధి మంజూరు చేశారు. సుమారు రూ. 72,41,307 నిధులు దుర్వినియోగమయ్యాయని పీడీ తెలిపారు. ఇందులో బ్యాంకు లింకేజీ రూ.48 లక్షలు, స్త్రీనిధి రూ.18.85 లక్షలు, పొదుపు సొమ్ము రూ.2.68 లక్షలు, ఉన్నతి రూ.46వేలు, సీఐఎఫ్ రూ.50వేలు, ఇతర సంఘాల నుంచి నిధుల మళ్లింపు రూ.1.81 లక్షలు దుర్వినియోగానికి పాల్పడ్డారు. సంబంధిత సిబ్బందిపై క్రిమినల్ కేసు నమోదు చేశారని, సొమ్ము మొత్తాన్ని రికవరీ చేస్తామని తెలిపారు.

భారీగా పెరిగిన సంత ఆదాయం

అనంతపురంరూరల్, సెప్టెంబరు 29: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌కు ఈవారం పశువుల సంత ద్వారా భారీ ఆదాయం సమకూరింది. గత వారం రూ.4.49 లక్షలు ఆదాయం వచ్చింది. ఆ ఆదాయం మరింత పెరిగింది. ఈ వారం ఏకంగా రూ.5లక్షలు దాటింది. రెండు రోజుల పశువుల సంతతో రూ.5,91,480 వచ్చింది. అక్టోబరు 2న అమావాస్య కారణంగా ఆదాయం పెరిగినట్లు తెలుస్తోంది. పశువుల సంత నుంచి ఇంతస్థాయిలో ఆదాయం ఇదే మొదటి సారి అని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ వారం ఎద్దులు, ఎనుముల సంత కంటే గొర్రెలు, మేకల సంత ద్వారా ఆదాయం ఎక్కువగా వచ్చింది. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.3,42,370, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.2,49,110 వచ్చినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు.

పప్పుశనగ పంపిణీ ఎప్పుడో..?

● ఖరారుకాని టెండర్లు
● నల్లరేగడి రైతుల ఎదురుచూపులు
● రేపటి నుంచి రబీ సీజన్



అనంతపురం అర్బన్, సెప్టెంబరు 29: రబీ సీజన్ అక్టోబరు ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ సీజన్‌లో జిల్లాలోని నల్లరేగడి భూముల్లో రైతులు పప్పుశనగ పంటను సాగు చేస్తూ వస్తున్నారు. ఇప్పటికే సేద్యం పనులు పూర్తి చేసుకున్నారు. వర్షం వస్తే పప్పుశనగ పంట సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ప్రతి ఏడాది ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రైతులకు పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేస్తోంది. ఈ సారి ఇప్పటి దాకా పప్పుశనగ సబ్సిడీ ధరలు ఖరారు చేయలేదు. ఇంత వరకు రాష్ట్ర స్థాయిలో పప్పుశనగ సరఫరా కోసం టెండర్లు ఖరారు చేయకపోవడంతో ఎప్పటిలోగా విత్తనాలు పంపిణీ చేస్తారో తెలియని అయోమయంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

సబ్సిడీ ధరలు ఖరారు చేసేదెన్నడో..?: ఈ ఏడాది జిల్లాకు 27,139 క్వింటాళ్ల పప్పుశనగ విత్తనాలు కేటాయించారు. గతేడాది సెప్టెంబరు 25వతేదీ సబ్సిడీ ధరలు ఖరారు చేశారు. ఆ మరుసటి రోజు నుంచి రైతు సేవా కేంద్రాల్లో పప్పుశనగ విత్తనాల కోసం రైతుల పేర్లు నమోదు చేశారు. ఈసారి ఇప్పటి దాకా రాష్ట్ర స్థాయిలో పప్పుశనగ సరఫరా కోసం టెండర్లు ఖరారు చేయలేదు. సంబంధిత రాష్ట్ర ఉన్నతాధికారులు నిర్లక్ష్యమే ఇందుకు కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. గత ఏడాది ఏడాది రబీ సీజన్‌లో జిల్లాకు 27,266 క్వింటాళ్ల పప్పుశనగ కేటాయించారు. అప్పట్లో క్వింటాలు పూర్తి ధర రూ.8100గా నిర్ణయించారు. ఇందులో 40 శాతం సబ్సిడీ రూ.3240 పోను రైతు వాటా మొత్తం రూ.4860 చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. ఈసారి ఎంత శాతం సబ్సిడీ నిర్ణయిస్తారో తెలియాల్సి ఉంది.

రేపటి నుంచి రబీ సీజన్ ప్రారంభం: అక్టోబరు 1 నుంచి రబీ సీజన్ ప్రారంభం కానుంది. ఈ ఏడాది రబీ సాధారణ సాగు విస్తీర్ణం 1.18 లక్షల హెక్టార్లుగా నిర్ణయించారు. ఇందులో పప్పుశనగ 72వేల హెక్టార్లు, మిగతా విస్తీర్ణంలో జొన్న, మొక్కజొన్న, వేరుశనగ తదితర రకాల పంటలు ఉన్నాయి. గత ఏడాది రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 82వేల హెక్టార్లల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇందులో అత్యధికంగా 49వేల హెక్టార్లల్లో పప్పుశనగ సాగు చేశారు. ఈసారి ఆశించిన స్థాయిలో వానలు పడితే సాధారణ సాగు విస్తీర్ణంలో పంటలు సాగయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

టెండర్లు ఖరారు చేయలేదు



పప్పుశనగ సరఫరా కోసం రాష్ట్ర స్థాయిలో ఇంకా సబ్సిడీ ధరలు ఖరారు చేయలేదు. టెండర్లు పూర్తి కాగానే సబ్సిడీ ధరలు నిర్ణయిస్తారు. జిల్లాకు 27,139 క్వింటాళ్ల పప్పుశనగ విత్తనాలు కేటాయించారు. సబ్సిడీ ధరలు ఖరారుకాగానే రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించి, నిర్దేశించిన సమయంలోగా పం పిణీకి చర్యలు తీసుకుంటాం.

- ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా ...

దేవీనవరాత్రి ఉత్సవాలకు విరాళం

ధర్మవరం, సెప్టెంబరు 29: స్థానిక లక్ష్మీచెన్నకేశవపురంలో టీడీపీ నాయకుడు చీమల నాగరాజు దేవీనవరాత్రి ఉత్సవాలకు రూ. 10 వేల విరాళాన్ని నిర్వాహకులకు ఆదివారం అందజేశారు. ఏటా నవరాత్రుల్లో లక్ష్మీచెన్నకేశవపురంలోని పార్క్‌లో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి.. పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గ్రామాల్లో సీసీ రోడ్లు

గాండ్లపెంట, సెప్టెంబరు 29: మండలవ్యాప్తంగా రూ.మూడు కోట్ల ఉపాధి పథకం నిధులతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు పీఆర్ జేఈ రెడ్డివరప్రసాద్ ఆదివారం తెలిపారు. మండలంలోని 14 పంచాయతీల్లోని గ్రామాల్లో 6,749 మీటర్ల రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు.

ఉద్యోగుల సమావేశం

కదిరి అర్బన్, సెప్టెంబరు 29: స్థానిక ఎస్ఎంఎఎల్ డిగ్రీ కళాశాలలో ఓడియారాజ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశం ఆదివారం జరిగింది. ఇందులో ఉమ్మడి అనంతరం జిల్లా సంఘం నాయకులు పాల్గొన్నారు. సంఘం అభివృద్ధి, చేపట్టే కార్యాచరణపై చర్చించారు. అక్టోబరు 16న ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు శ్రీనివాసులు, నారాయణ, జేవీ రమణ, మురళీ, గోపాల్, రామాంజనేయులు, సోముశేఖర్ పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థికసాయం

కదిరి అర్బన్ , సెప్టెంబరు 29: మండలంలోని కుమ్మరవాండ్లపల్లిలో తులసమ్మ అనారోగ్యంతో మరణించింది. ఆమె నిరుపేద కావడంతో దహన సంస్కారాల కోసం కదిరి మానవాత సంస్థ సభ్యులు రూ. మూడు వేలు ఆర్థిక సాయాన్ని తులమ్మ కుమారైకు అందజేయడంతో పాటు వైకుంఠ రథం సమకూర్చారు. ఇందులో ఆ సంస్థ సభ్యులు ఆత్మారెడ్డి, సురేష్‌బాబు, నాగభూషణ, వేణుగోపాల్‌రెడ్డి, మహబూబ్‌బాషా, రామమోహన్ పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

కదిరి అర్బన్, సెప్టెంబరు 29: నవోదయ ప్రవేశాలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పట్టణంలోని జ్ఞానసుధ నవోదయ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు మస్తాన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నవోదయ ప్రవేశ పరీక్షలు రాసే విద్యార్థులకు అక్టోబరు 3 నుంచి జనవరి వరకు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. కోచింగ్ సెంటర్ ప్రారంభించి ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9494199967- 08494 292050ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

రెడ్డిపల్లిలో ఉచిత వైద్యశిబిరం

నల్లమాడ, సెప్టెంబరు 29: మండలంలోని రెడ్డిపల్లిలో ఆదివారం అనంతపురం మార్క్ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. దీన్ని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ప్రారంభించారు. 178 మందికి గుండె పరీక్షలు నిర్వహించి... 18 మందికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు ఈ శిబిరంలో గుర్తించారు.

చింతల గంగమ్మకు బోనాలు



నంబులపూలకుంట సెప్టెంబరు 29 : మండలంలోని చీమలచెరువుపల్లిలో ఆదివారం గ్రామస్థులు చింతల గంగమ్మకు బోనాలు సమర్పించారు. అమ్మను ప్రత్యేకంగా అలంకరించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఊరేగింపుగా ఆలయం వద్ద బోనాలు తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు.

దేవర కలెక్షన్లపై సంబరాలు

కొత్తచెరువు, సెప్టెంబరు 29: జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర చిత్రానికి ఒక రోజులోనే రూ.172 కోట్లు కలెక్షన్ రావడంపై ఆయన అభిమానులు, తెలుగు తమ్ముళ్లు ఆదివారం కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. స్థానిక సందీప్ థియేటర్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు తమ్ముళ్లు మణిదీప్‌మిత్ర, చికెన్‌సెంటర్ వెంకటేశ్, ఉపేంద్ర చౌదరి, అభి, పోలినేని మౌర్య, అవినాశ్, గిరి, లోహిత్, అనిల్, లోకేశ్, దివాకర్, కిలారి నరేంద్ర పాల్గొన్నారు.



కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న తెలుగు తమ్ముళ్లు

రోడ్డు మధ్యలో గుంత



ముదిగుబ్బ, సెప్టెంబరు 29: స్థానిక ఆర్డీటీ కార్యాలయం సమీపంలో జాతీయ రహదారి మధ్యలో గుంత ఏర్పడి పలు ప్రమాదాలకు కారణమవుతోంది. అనంతపురం నుంచి కదిరికి నిత్యం వందలాది బస్సులు, ఆటోలు, లోడింగ్‌తో కూడిన లారీలు, ద్విచక్ర వాహనాలు వెళ్తుంటాయి. రహదారి మధ్యలో ఏర్పడిన ఈ గుంతను తప్పించబోయి.. వాహనదారులు అనేక ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రివేళల్లో దీని వల్ల అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి... రహదారి మధ్యలో ఏర్పడిన ఈ గుంతను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

చోరీకోసం వెళ్లి.. విద్యుదాఘాతంతో మృతి



మహబూబ్‌బాషా మృతదేహం

గోరంట్ల, సెప్టెంబరు 29: మండలంలోని కాగానిపల్లి సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వస్తువులను చోరీ చేస్తుండగా మహబూబ్‌బాషా (41) అనే వ్యక్తి శనివారం రాత్రి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. సోమందేపల్లిలోని షిర్డినగర్‌కు చెందిన గుజిరీ వ్యాపారి మహబూబాషా మరికొందరితో కలిసి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగలకొట్టి అందులో విలువైన రాగి వైర్‌ను చోరీలకు పాల్పడేవాడు. కాగినిపల్లి సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్‌ను తొలగిస్తున్న సమయంలో షాక్ గురై అక్కడిక్కడే మృతిచెందాడు. సంఘటన జరిగిన వెంటనే అతడికి తోడుగా వచ్చిన దొంగలు పరికరాలు అక్కడే వదిలి పరారయ్యారు. ఆదివారం తెల్లవారుజామున సోమందేపల్లి నుంచి కొంతమంది సంఘటనా స్థలానికివచ్చి శవాన్ని తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఆ సయయంలో పొలం యజమాని చాకలి వెంకటరామప్ప అక్కడికి చేరుకుని వారిని ప్రశ్నించాడు. బహిర్భూమికి వచ్చామని, వారు అక్కడి నుంచి రోడ్డుపైన ఉన్న ఆటోలో వెళ్లిపోయినట్లు తెలిపారు. అనంతరం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పడి ఉన్న శవాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఏఎస్ఐ ధనుంజయరెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రకాష్ సంఘటనా ప్రదేశానికి చేరుకుని స్పానర్ల కిట్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేతన్న జీవితాల్లో వెలుగు.!

వంద యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

కూటమి హామీ అమలు కోసం నిరీక్షణ



ధర్మవరం, సెప్టెంబరు 29 : నేతన్న జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో కూటమి నాయకులు సార్వత్రిక ఎన్నికల్లో చేనేత కార్మికులకు 100 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తాను ఇచ్చిన హామీలను శరవేగంగా అమలు చేసే విధంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు పింఛన్లు పెంచింది.. అన్నక్యాంటీన్లను పునఃప్రారంభించింది. తాజాగా చేనేత కార్మికులకు ఉచిత కరెంటు పథకం అమలుకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. 100 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అమలుకు ప్రభుత్వం జీఓ తీసుకురానుంది. జిల్లాలో అధికారికంగా 18 వేల మగ్గాలు ఉండగా వాటి ఉపకులాల వారు మరో మూడు వేల దాకా ఉన్నాయి. అదేవిధంగా జిల్లాలో 10 వేల కుటుంబాలు ఉన్నాయి. కానీ వీరంత మగ్గం నేసే పని గిట్టుబాటు కాక బేల్దారి పనులు, ఇతర కూలీలుగా మారిపోయారు. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం చేనేతలకు అనేక రాయితీలు.. పథకాలతో పాటు ఆరోగ్య బీమా అమలు చేసింది. 2019లో ఎన్నికల ముందు చేనేతలకు వంద యూనిట్ల వరకు ఉచిత కరెంటు అమలుకు శ్రీకారం చుట్టింది. అయితే అప్పటి ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఉచిత కరెంటుతో పాటు అప్పటి వరకు ఉన్న సంక్షేమ, రాయితీ పథకాలను నిలిపివేసింది. కేవలం నేతన్న నేస్తం పథకంతో సరిపెట్టింది. ప్రస్తుతం విద్యుత్ బిల్లులు బారీగా వస్తున్నాయి. రూ.500 నుంచి 700 వరకు బిల్లు వస్తుండగా నేతన్నకు భారంగా మారింది. దీన్ని గుర్తించిన కూటమి నాయకులు ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో చేనేతలకు ఉచితకరెంటు హామీ ఇచ్చింది. అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేనేతలకు వంద యూనిట్ల ఉచిత కరెంటు అమలుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే చేనేత కార్మికులు అందరికీ గుర్తింపు కార్డులు లేవు. అంతేగాక వైసీపీ ప్రభుత్వం కేవలం మగ్గం ఉన్న నేత కార్మికులకే నేతన్న నేస్తం అమలు చేసింది. దీంతో చాలా మంది చేనేతలకు ఈ పథకం వర్తించలేదు. అంతేగాక ఉప వృత్తులవారికి మొండిచేయి చూపింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నేతన్న నేస్తం లబ్ధిదారులకే ఉచిత కరెంటు అమలు చేస్తుందా... లేదా సర్వే చేసి చేనేత కార్మికులతో పాటు ఉపవృత్తులు చేసేవారికీ వర్తింపు చేస్తుందా... అనే విషయంలో స్పష్టత లేదు. ప్రభుత్వ జీఓ విడుదల చేస్తే గాని స్పష్టత రాదని చేనేత కార్మికులు అంటున్నారు.

200 యూనిట్లకు పెంచాలి



ఎన్నికలలో ఎన్డీఏ కూటమి చేనేత కార్మికులకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు 2019లో టీడీపీ ప్రకటించిన 100 యూనిట్లకు పరిమితం చేసేలా ఉంది. దీని వల్ల చాలా మంది నేత కార్మికులు ఉచిత కరెంటుకు అనర్హులవుతారు. దాన్ని 200 యూనిట్లకు పెంచాలి.

-లక్ష్మీరెడ్డి, చేనేత కార్మికుడు, ధర్మవరం

ఉప వృత్తులకూ ఇవ్వాలి



కండెలు చుట్టేవారు.. రంగులు అద్దేవారు.. అచ్చులు అతికేవారు.. వార్పు పెట్టేవారు.. పొదుగు పట్టేవారు కూడా చేనేత కార్మికుల కిందకు వస్తారు. వైసీపీ మగ్గం నేసే వారికి మాత్రమే పథకాన్ని అమలు చేసి అన్యాయం చేసింది. కూటమి ప్రభుత్వమైనా అందరికి ఉచితకరెంటు అమలు చేయాలి.

-ప్రసాద్, రంగుల అద్దకం కార్మికుడు, ధర్మవరం

పుట్టపర్తిలో కుండపోత

జలమయమైన రహదారులు

కొత్తచెరువు, సెప్టెంబరు 29: పుట్టపర్తిలో ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు కుండపోత వర్షం కురిసింది. దీంతో రహదారులపై వర్షపు నీరు ప్రవహించింది. ముఖ్యంగా సత్యమ్మగుడి ఆలయ ప్రాంగణంలో వర్షపు నీరు చేరి మడుగును తలపించింది. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో ప్రజలు సత్యసాయిబాబా భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమీపంలోని హాస్టళ్లలోకి సైతం వర్షపు నీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు →



సమస్యలు పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే

కదిరి /అర్బన్ /లీగల్, సెప్టెంబరు 29 : ప్రైవేటు పాఠశాలల సమస్యలు పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక దత్తా ఫంక్షన్‌హాల్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కొత్తగా ఎంపికైన ప్రైవేటు పాఠశాలల యూనియన్ కమిటీని ఆయన అభినందించారు. కాగా, విజయవాడ వరద బాధితుల సహాయార్థం ప్రైవేటు పాఠశాలల యజమాన్యం రూ. రెండు లక్షలు విరాళాన్ని సీఎం సహాయనిధికి అందజేసింది. ఆచెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. ఇందులో సాధన పాఠశాల రూ.75 వేలను విరాళంగా సేకరించింది. ఆ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న గండి హరి కౌస్తుభ రూ.ఆరు వేలు విరాళంగా సేకరించడంతో ఎమ్మెల్యే ఆ విద్యార్థినిని సన్మానించాడు. కార్యక్రమంలో అనీల్ కుమార్ రెడ్డి, సింగారెడ్డి, క్రిష్ణమూర్తి, జయచంద్ర నాయుడు, రవిచంద్రారెడ్డి, రాఘవేంద్ర, కదిరి డివిజన్ ప్రైవేటు పాఠశాలల యజమానులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట, హరి కౌస్తుభకు సన్మానం

పోలీస్ లాంఛనాలతో సీఐ అంత్యక్రియలు

నల్లమాడ సెప్టెంబరు 29: మండలలోని అరవాండ్లపల్లిలో సీఐ అర్జున్‌నాయక్ అంత్యక్రియలు ఆదివారం పోలీస్ లాంఛనాలతో నిర్వహించారు. కడప సెంట్రల్ క్రైమ్ స్టేషన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న అర్జున్ శనివారం గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం అరవాండ్లపల్లికి ఆదివారం తీసుకొచ్చారు. అతని మృదేహానికి పలువురు పూలమాలలు వేసి నివాళుర్పించారు. వారికుటుంబ సభ్యులను పరామర్శించి పోలీస్ శాఖ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆయన మృతదేహానికి జిల్లా అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసుల ఆధ్వర్యంలో జిల్లా పోలీసులతో పాటు కడప నుంచి వచ్చిన ఏఆర్ పోలీసులు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ నరేంద్రరెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

చీకట్లో విజ్ఞాన భాండాగారాలు

- అభివృద్ధి సైలెన్స్...
- అద్దె భవనాల్లో గ్రంథాలయాలు
- సొంత భవనాలూ లేని వైనం
- కనీస సౌకర్యాలు లేక పాఠకుల పాట్లు
- పన్ను మంజూరుకాక.. అభివృద్ధి కుంటు
- పట్టించుకోని గత ప్రభుత్వం

కదిరి అర్బన్, సెప్టెంబరు 29: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని గ్రంథాలయాలు ఐదేళ్లుగా తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. వాటిని డిజిటల్ హబ్‌లుగా తీర్చిదిద్దుతామన్న వైసీపీ నాయకులు ... అందులో కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదు. దీంతో విజ్ఞాన భాండాగారాలు చీకట్లో ఉండిపోయాయి.

నిధుల కొరత

ప్రభుత్వానికి చెల్లించే ఇంటి పన్నులో ఎనిమిది శాతం గ్రంథాలయ పన్ను కూడా కలిసి ఉంటుంది. స్థానిక సంస్థల నుంచి వసూలైన ఆ పన్నును నెల రోజులలోపు గ్రంథాలయ సంస్థలకు జమ చేయాల్సి ఉంది. అయితే స్థానిక సంస్థలు ఆ నిధులను గ్రంథాలయ శాఖకు ఇవ్వడం లేదు. ఇలా ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా రూ.13.34 కోట్లు వరకు పన్ను బకాయిలు రావాల్సి ఉందని ఆ శాఖాధికారులు చెబుతున్నారు.

ఐదేళ్లూ అంతంతే

గ్రంథాలయాను అభివృద్ధి చేస్తాం... డిజిటల్ హబ్‌లుగా తీర్చిదిద్దుతామన్న వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో వాటి అభివృద్ధి గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. సంస్థకు రావల్సి బకాయిలపై శ్రద్ధ చూపలేదు. దీంతో రూ. కోట్లులో బకాయిలు పేరుకుపోయాయి. గ్రంథాలయ సంస్థ అభివృద్ధి ఊసేలేకుండా పోయింది. ఏటా నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాలకు ఖర్చులు సైతం విడుదల చేయలేదు. దీంతో ఉద్యోగులు తమ జేబుల నుంచి ఖర్చు చేయాల్సి వచ్చింది.

వేతనాలకు ఇక్కట్లే

గ్రంథాలయ సంస్థలకు జీతాల చెల్లింపును సైతం గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఉద్యోగులు ఇబ్బంది పడకూడదని పన్ను నుంచి జీతాలు తీసుకునే వెసులుబాటు కలిపించారు. వాటిని ప్రభుత్వం తిరిగి గ్రాంటు రూపంలో సంస్థకు చెల్లిస్తుంది. గత ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఉద్యోగులకు సరిపడే గ్రాంటు విడుదల చేయలేదు. 15 శాతం గ్రాంటు మాత్రమే విడుదల చేస్తూ వచ్చింది. దీంతో ఉద్యోగుల జీతాలనూ పన్ను ద్వారా చెల్లించాల్సి వచ్చింది. అంతేకాకుండా సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది.

నిరుపయోగంగా...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏవైనా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు అనేక మంది నిరుద్యోగ యువతీ యువకులు గ్రంథాలయాలకు వచ్చి.. పోటీ పరీక్షలకు అవసమైన పుస్తకాలను చదివేవారు. అయితే నిధుల కొరత వల్ల గ్రంథాలయాలకు ప్రస్తుత పోటీ పరీక్షలకు తగ్గట్టు కొత్త పుస్తకాలు వచ్చేవి కావు. దీంతో గ్రంథాలయాలకు వచ్చిన నిరుద్యోగులు నిరుత్సాహంతో వెనుతిరుగుతున్నారు. దీంతో గ్రంథాలయాలు నిరుపయోగంగా మారాయి.

అద్దె భవనాల్లో..

ఉమ్మడి జిల్లాలో నాలుగు ప్రథమశ్రేణి, ఎనిమిది ద్వితీయశ్రేణి, 58 శాఖ గ్రంథాలయాలున్నాయి. వీటిలో 45 గ్రంథాలయాలకు సొంత భవనాలు లేవు. దీంతో అద్దె భవనాల్లో.. అసౌకర్యాల నడుమ తూతూ మంత్రంగా వీటిని నిర్వహిస్తున్నారు. పలు గ్రంథాలయాలను మేడలపై నిర్వహిస్తుండటంతో.. అనేక మంది వృద్ధులు వాటికి వెళ్లలేక పోతున్నారు.



కదిరిలో మేడపైన అద్దె భవనంలో నిర్వహిస్తున్న గ్రంథాలయం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

సంస్థకు రావాల్సిన పన్ను బకాయిలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సిబ్బంది కొరత, సమస్యలను ఉన్నతాధి కారుల ద్వారా ప్రభుత్వానికి నివేదించి పరిష్కారానికి కృషి చేస్తాం.

- రమా, సెక్రటరీ, జిల్లా గ్రంథాలయ సంస్థ

క్రైం న్యూస్ ..

వ్యక్తికి దేహశుద్ధి



సొమ్మసిల్లి పడిపోయిన రామచంద్రారెడ్డి

కొత్తచెరువు, సెప్టెంబరు 29 : మండలంలోని ఓ గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి ఆదివారం సాయంత్రం అదే గ్రామంలోని ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయడంతో స్థానికులు అతడిని స్తంభానికి కట్టేసి, దేహశుద్ధి చేసి, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఇందిర.. సిబ్బందితో గ్రామానికి చేరుకుని బాధిత మహిళ, గ్రామస్థులతో వివరాలు ఆరాతీశారు. రామచంద్రారెడ్డిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు.

అగ్నిప్రమాదంలో దంపతులకు గాయాలు

కొత్తచెరువు, సెప్టెంబరు 29: స్థానిక బీసీ కాలనీలో అద్దె ఇంటిలో పెయింటర్ రాజు, ఆయన భార్య అగ్ని ప్రమాదంలో ఆదివారం గాయపడ్డారు. రాజు చికెన్ వండటానికి కట్టెల పొయ్యి వెలిగించాడు. కట్టెలు మండకపోవడంతో టిన్నర్ డబ్బా ఓపెన్ చేసి పొయ్యిలోకి చల్లాడు. దీంతో మంటలు ఆ టిన్నర్ డబ్బాకు వ్యాపించడంతో.. ఆ డబ్బా ఒక్కసారిగా పేలింది. రాజుకు మంటలు వ్యాపించడంతో గట్టిగా కేకలు వేశాడు. ఇంటిలో ఉన్న భార్య ఆయన్ను గట్టిగా అతుక్కోవడంతో ఆమెకూ ఆ మంటలు వ్యాపించాయి. ఇద్దరు సమీపంలోని నీటి తొట్టెలోకి దూకారు. స్థానికులు వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

రేకులషెడ్ కూల్చివేత



బాధితురాలు అరుణ

ధర్మవరం, సెప్టెంబరు 29 : తాను కట్టుకున్న రేకుల షెడ్‌ను దౌర్జన్యంగా కూల్చేశారని ఓ మహిళ టూటౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. పట్టణంలోని గుట్టకిందపల్లికి చెందిన ఎం.అరుణకు గుట్టకిందపల్లిలో గ్రామ సర్వేనెంబరు 545లో సెంట్ స్థలంలో పునాదులపై రేకుల షెడ్డు నిర్మించుకుంది. కొన్నేళ్లుగా అక్కడే నివాసముంటోంది. ఆదివారం ఉదయం రాజు, కల్పన, సురేశ్, నాగేంద్రమ్మ మరికొందరు వచ్చి ఎక్స్‌కవేటర్లతో పునాదులతో సహా షెడ్‌ను కూల్చేశారు. ప్రశ్నించిన అరుణపై వారు దాడి చేశారు. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

తనకల్లు, సెప్టెంబరు 29: మండలంలోని వివిధ గ్రామాల్లో రౌడీషీటర్లకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఎస్ఐ గోపీ ఆధ్వర్యంలో పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.

కోడిపందెంరాయుళ్ల అరెస్టు

తనకల్లు, సెప్టెంబరు 29: మండలంలోని ఈతోడు గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం కోడిపందెలు నిర్వహిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపీ తెలిపారు. వారి వద్ద నుంచి రెండు కోడిపుంజులు, రూ.30,350ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

టీడీపీ సభ్యత్వంతో బహుళ ప్రయోజనాలు : పల్లె

పుట్టపర్తి, సెప్టెంబరు 29: తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో బహుళ ప్రయోజనం లభిస్తాయని, ప్రతి కార్యకర్తకు ఈ సభ్యత్వ కార్డు ఆధార్‌కార్డు లాంటిదని మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం సాయిఆరామంలో టీడీపీ నియోజకవర్గ సభ్యత్వ నమోదుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రూ.100 టీడీపీ సభ్యత్వం ఉన్న వారికి రూ.2లక్షల ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందన్నారు. ప్రమాదంలో మరణించిన ఆ కార్యకర్త కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా వారి పిల్లలకు ఉచిత విద్య అందిస్తామని అన్నారు. వరద బాధితులకు రూ.10 లక్షలు విరాళం అందించిన అమడగూరు మండల కమిటిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు విజయ్‌కుమార్, రామకృష్ణ, శ్రీనివాసులు, మలిరెడ్డి, షైలే శంకర్, జయచంద్ర, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

ఓబుళదేవరచెరువు: విజయవాడ వరద బాధితులకు రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి బోరు రమణ రూ.50,116 విరాళంగా ఇచ్చారు. ఆ మొత్తాన్ని ఆదివారం పుట్టపర్తి సాయిఆరామంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డికి అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె

నోట్‌పుస్తకాల పంపిణీ

కొత్తచెరువు, సెప్టెంబరు 29: స్థానిక బీసీ హాస్టల్‌లోని విద్యార్థులకు చెరుకూరి చంద్రశేఖర్ సహకారంతో నోటు పుస్తకాలు, పెన్నులు, తినుబండారాలు ఆదివారం పర్యావరణ వేత్త భాస్కర్‌నాయుడు పంపిణీ చేశారు. హాస్టల్‌లోని 80 మంది విద్యార్థులకు రూ.10వేలు విలువ చేసే విద్యాసామగ్రిని అందజేశారు.

ఏచూరి రాజనీతి.. ఆదర్శనీయం



మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 29: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి సేవలు దేశానికి ఎంతో అవసరమని, ఆయన రాజనీతి ఎందరికో ఆదర్శనీయమని సీడబ్లూసీ సభ్యుడు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ఏచూరి సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రఘువీరా మాట్లాడుతూ.. ఏచూరి విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలను అలవరుచుకున్నారని అన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకుడిగా మొదలైన ఆయన ప్రస్థానం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయికి చేరుకుందన్నారు. రాజ్యసభలో ఆయన మాట్లాడే విధానం నిబద్ధతో కూడుకుని ఉండేదన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ఉపాధి చట్టం, సమాచార హక్కు చట్టం రావడానికి ఎంతగానో కృషి చేశాడన్నారు. కార్మిక, కర్షక కష్టజీవులకు ఆయన అండగా ఉండేవారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, నాయకులు సుబ్బారెడ్డి, వెంకటేష్, శ్రీనివాసులు, దిల్షాద్, కేటీ శ్రీధర్, గిరీష్, శ్రీరాములు తదితరులు ఉన్నారు.

ప్రాచీన కళలపై పరీక్ష



పరీక్షలకు హాజరైన నృత్యకారిణులు

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 29: ప్రాచీన కళలయిన భరత నాట్యం, కూచిపూడి, కథక్‌కళీ నృత్యకారిణులకు ఆదివారం హిందూపురంలోని ఎంజీఎం పాఠశాలలో పరీక్షలు నిర్వహించారు. అభిజ్ఞా నృత్యాలయం చంద్రబాను చతుర్వేది ఆధ్వర్యంలో ప్రాచీన కళాకేంద్ర చండీగర్ యూనివర్సిటీ వారు ఈ పరీక్షలు నిర్వహించారు. ఉత్తర భారతదేశంలో మాత్రమే నిర్వహించే ఈ పరీక్షలు ఈసారి హిందూపురంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ గంగప్ప మాట్లాడుతూ దేశ సంపద ప్రాచీన కళలు అన్నారు. దేశ, విదేశాల్లో మన కళలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. పాశ్చాత్య దేశీయులు మన దేశానికి వచ్చి భరత నాట్యం, కుచిపూడి, కథక్‌కళి నేర్చుకుంటున్నారంటే మన కళలకు ఎంత ప్రాధాన్యత ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా 50 మంది నృత్యకారిణులు పరీక్షలకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఇన్విజిలేటర్‌గా జ్యోతి శేఖర్, హెచ్ఎం సామ్రాజ్యం, ప్రిన్సిపాల్ సుధాస్రవంతి తదితరులు హాజరయ్యారు.

దసరాకు ఏర్పాట్లు పూర్తి



కరపత్రాలను విడుదల చేస్తున్న రమానంద

లేపాక్షి, సెప్టెంబరు 29: దసరా శరన్నవరాత్రి వేడుకలకు దుర్గా వీరభద్ర స్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రమానంద తెలిపారు. ఆదివారం లేపాక్షి ఆలయంలో దసరా వేడుకల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు 3 నుంచి 12 వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తామని తెలిపారు. వేడుకలను వైభవంగా నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలన్నారు.

హెంజేరు సిద్దేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 29: మండలంలోని హేమావతి హెంజేరు సిద్దేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దేశ్వరస్వామికి వివిధ అభిషేకాలు, కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం జరిపి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉన్న కాలభైరవేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, విరూపణ్ణస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు ని ర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు శివకుమార్ స్వామి, సిద్దలింగేశ్వరస్వామి, మహేష్‌కుమార్, గౌతమ్, ప్రదీప్ తెలిపారు.



అలంకరణలో స్వామివారు

కాళికాంబకమఠేశ్వరస్వామికి పూజలు

రొళ్ల, సెప్టెంబరు 29: మండలంలోని రత్నగిరిలో వెలిసిన కాళికాంబ కమఠేశ్వర స్వామి వార్లకు ఆదివారం ప్రత్యేక అలంకరణలతో విశేష పూజలు జరిపించారు. కాళికాంబ కమఠేశ్వరస్వామికి పూలతో అలంకరించి కుంకుమార్చన, అభిషేకాలు, విశేష అలంకరణలు చేసి పూజలు చేశారు. ఆంధ్రప్రాంతం భక్తులేకాక సమీప కర్ణాటక నుండి భక్తులు విశేషంగా పాల్గొన్నారు.



స్వామివార్లకు ప్రత్యేక అలంకరణ

జగన్ తిరుమల పర్యటనను

ఎందుకు రద్దు చేసుకొన్నారో చెప్పాలి



ఆలయంలో గోపూజ చేస్తున్న దృశ్యం

మడకశిరటౌన్, సెప్టెంబరు 29: మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తిరుమల పర్యటనకు బయలుదేరి ఎందుకు రద్దు చేసుకొన్నారో చెప్పాలని బీజేపీ కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ ప్రశ్నించారు. ఆదివారం మడకశిర పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు గోవు గోశ వినుగోవిందా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రపంచంలోని హిందువులంతా కలియుగ ప్రత్యక్ష దైవంగా ఆరాధించే వెంకటేశ్వరస్వామికి కలుషిత నైవేద్యం సమర్పించారని, లడ్డూ తయారీలో కల్తీ నూనెలు వాడారని ల్యాబ్ రిపోర్టులు చెబుతున్నా జగన్, వైసీపీ నేతలు ఎదురుదాడి చేస్తుండటం న్యాయమేనా అంటూ ప్రశ్నించారు. డిక్లరేషన్ ఇచ్చేందుకు జగన్ ఎందుకు భయపడుతున్నారని, అందుకోసమే తిరుమల పర్యటనను రద్దు చేసుకొన్నారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, వెంకటేష్, లెంకప్పతోపాటు పలువురు నాయకులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

- పురం, పెనుకొండ, మడకశిరలో భారీ వర్షం
- రోడ్లు జలమయం ● ఇళ్లలోకి వర్షపు నీరు

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 29: పట్టణంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల దాకా వర్షం దంచి కొట్టింది. ఒక్క సారిగా భారీ వర్షం పడటంతో రోడ్లు వర్షం నీటితో నిండిపోయాయి. కొన్ని చోట్ల నీరు ముందుకు కదిలే వీలు లేక చెరువులను తలపించాయి. విషయం తెలుసుకున్న నూతన కమిషనర్ సంగం శ్రీనివాసులు ఆదివారం ఉదయం డీఈ బాలసుబ్రహ్మణ్యంతో కలిసి నీరు నిలువు ఉన్న రోడ్లను పరిశీలించారు. కొన్ని చోట్ల డ్రైన్లు పూడిక తీయక పోవడంతో వర్షపునీరు ముందుకు కదిలే వీలు లేకుండా రోడ్డుపైనే ఉండిపోయింది. దీంతో సిబ్బందిని పిలిచి పక్కన కాలువ తవ్వించి నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రైల్వేరోడ్డులోని పల్లా రెసిడెన్సీ ముందు భాగంలో, ముక్కడి పేట, బాలాజీ సర్కిల్ తదితర ప్రాంతాల్లో నీరు రోడ్డుపై ఉండి పోయి వాహనదారులకు, పాదచారులకు ఇబ్బంది కలిగింది. వర్షాకాలం ప్రజలకు ఇబ్బందులు కలగ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

పెనుకొండ రూరల్: మండలంలోని ఆదివారం తెల్లవారుజామున 6 గంటల నుంచి 8 గంటల వరకు కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు, రహదారులు పొంగి పొర్లాయి. ఎగువ నుంచి నీరు దిగువకు రావడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షానికి పెనుకొండ-కోనాపురం రహదారిలో నడుము లోతు నీరు నిలువ ఉండిపోయింది. మడకశిర నుంచి కోనాపురం వెళ్లే రహదారిలో ఓ రియల్టర్ కంచె వేసి స్థలం పక్కన అడ్డంగా మట్టి వేయడంతో నీరు రోడ్డుపైకి చేరింది. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మండల వ్యాప్తంగా 32.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.



మడకశిరలో కురుస్తున్న వర్షం



రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న కమిషనర్

మడకశిరటౌన్: నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం ఉదయం 5.30 గంటల నుంచి ఓ మోస్తారు వర్షం కురవడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేశారు. వేరుశనగ పంటను తొలగించుకొనేందుకు ఎంతో వీలు పడుతుందని తెలిపారు. గత మూడు నాలుగు రోజుల నుంచి చిరు జల్లులు కురుస్తుండటంతో కంది, అలసంద, ఉలవలు తదితర పంటలు పచ్చదనాన్ని సంతరించుకొన్నాయి. ఉదయం నుంచి 11 గంటల వరకు వర్షం కురిసింది.



పెనుకొండలోని నారాయణమ్మ కాలనీకి వెళ్లే రహదారిలో భారీగా నిలిచిన వర్షపు నీరు



కోనాపురం రహదారిలో నిలిచిన వర్షపు నీరు

విపత్తుల నుంచి కాపాడండి



ఇంటిలోకి నీరు చేరడంతో ఆందోళన చెందుతున్న బాధితులు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 29: వర్షాలకు తమ ఇంటిలోకి నీరు చేరుతోందని రొద్దంలోని నాగార్జున, గాయత్రి వాపోయారు. రొద్దం నుంచి చెరుకూరుకు వెళ్లే రహదారిలో వ్యసాయం చేసుకుంటూ కుటుంబా న్ని పోషించుకుంటున్నారు. ఈ క్ర మంలో కాలనీకి చెందిన కొందరు ర హదారికి అడ్డంగా మట్టి దిబ్బలు, చె త్తా చెదారం వేయడంతో ఆదివారం కురిసిన వర్షానికి నీరు చేరడంతో ఇంటిలో ఉన్న వస్తువులు నీటిలో నానిపోయి నష్టపోయామన్నారు.



ఇంటిలోకి చేరిన నీరు

అగ్నిప్రమాదంలో దంపతులకు గాయాలు

కొత్తచెరువు, సెప్టెంబరు 29: స్థానిక బీసీ కాలనీలో అద్దె ఇంటిలో పెయింటర్ రాజు, ఆయన భార్య అగ్ని ప్రమాదంలో ఆదివారం గాయపడ్డారు. రాజు చికెన్ వండటానికి కట్టెల పొయ్యి వెలిగించాడు. కట్టెలు మండకపోవడంతో టిన్నర్ డబ్బా ఓపెన్ చేసి పొయ్యిలోకి చల్లాడు. దీంతో మంటలు ఆ టిన్నర్ డబ్బాకు వ్యాపించడంతో.. ఆ డబ్బా ఒక్కసారిగా పేలింది. రాజుకు మంటలు వ్యాపించడంతో గట్టిగా కేకలు వేశాడు. ఇంటిలో ఉన్న భార్య ఆయన్ను గట్టిగా అతుక్కోవడంతో ఆమెకూ ఆ మంటలు వ్యాపించాయి. ఇద్దరు సమీపంలోని నీటి తొట్టెలోకి దూకారు. స్థానికులు వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

టీడీపీ సభ్యత్వంతో బహుళ ప్రయోజనాలు : పల్లె

పుట్టపర్తి, సెప్టెంబరు 29: తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో బహుళ ప్రయోజనం లభిస్తాయని, ప్రతి కార్యకర్తకు ఈ సభ్యత్వ కార్డు ఆధార్‌కార్డు లాంటిదని మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయం త్రం సాయిఆరామంలో టీడీపీ నియోజకవర్గ సభ్యత్వ నమోదుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రూ.100 టీడీపీ సభ్యత్వం ఉన్న వారికి రూ.2లక్షల ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందన్నారు. ప్రమాదంలో మరణించిన ఆ కార్యకర్త కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా వారి పిల్లలకు ఉచిత విద్య అందిస్తామని అన్నారు. వరద బాధితులకు రూ.10 లక్షలు విరాళం అందించిన అమడగూరు మండల కమిటిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు విజయ్ కుమార్, రామ కృష్ణ, శ్రీనివాసులు, మలిరెడ్డి, షైలే శంకర్, జయ చంద్ర, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

ఓబుళదేవరచెరువు : విజయవాడ వరద బాధితులకు రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి బోరు రమణ రూ.50,116 విరాళంగా ఇచ్చారు. ఆ మొత్తాన్ని ఆదివారం పుట్టపర్తి సాయిఆరామంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డికి అందజేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 29: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సర్వసభ్య సమావేశానికి మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రణాళికలతో కూడిన నివేదికలతో తప్పక హాజరుకావాలన్నారు. ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, కో-ఆప్షన్ సభ్యులు సమావేశానికి హాజరుకావాల్సిందిగా ఆయన కోరారు.

విద్యుత్ ఏఈ లేక రైతుల అవస్థలు

గుడిబండ, సెప్టెంబరు 29: మండలానికి విద్యుత్ ఏఈ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. కొత్త కనెక్షన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఎస్టిమేట్లు వేసేందుకు ఏఈ లేకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరిగి వెళుతున్నామని రైతులు సన్నీరప్ప, హనుమంతరాయప్ప, కమలమ్మ, కరియన్న తదితరులు వాపోయారు. పొలాల్లో కొత్తగా బోర్లు వేసి విద్యుత్ కలెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో వేసిన బోర్లు నిరుపయోగంగా ఉన్నాయని వాపోయారు. ఏడీ కార్యాలయం వద్దకు వెళితే విచారించే నాథుడు లేడన్నారు. అధికారులు వెంటనే చొరవ తీసుకొని గుడిబండ మండలానికి ఏఈని నియమించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిచాలని కోరుతున్నారు.

మృతుల కుటుంబానికి పరామర్శ



అర్థిక సాయం అందిస్తున్న టీడీపీ నాయకుడు వెంకటేశ్వరరావు

పెనుకొండ టౌన్ అక్టోబర్ 29: పిడుగుపాటుతో మృతిచెందిన కుటుంబాన్ని టీడీపీ నాయకులు పరామర్శించి అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించారు. ఆదివారం గోరంట్ల మండలం దిగువ గంగంపల్లి తండాలో ఉదయం పిడుగుపడి ఒకే కుంటుంబానికి చెందిన దంపతులు చనిపోయిన సంఘటన చోటుచేసుకుంది. పోస్టుమార్టం నిమింతం పెనుకొండ ప్రభుత్వ అసుపత్రికి తరలించా రు. అక్కడికి వెళ్లి మృతదేహాలకు పూలమాలవేసి నివాళులర్పించా రు. అనంతరం టీడీపీ నేత వెంకటేశ్వరరావు అత్యక్రియలకు నగదు అందించారు. టీడీపీ నాయకుడు శశిభూషణ్ మృతుల కుంటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధైర్యపడకండి అండగా ఉంటామని బాధిత కుటుంబ సభ్యులతో అన్నారు.

రేకులషెడ్ కూల్చివేత

ధర్మవరం, సెప్టెంబరు 29: తాను కట్టుకున్న రేకుల షెడ్‌ను దౌర్జన్యంగా కూల్చేశారని ఓ మహిళ టూటౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. పట్టణంలోని గుట్టకిందపల్లికి చెందిన ఎం.అరుణకు గుట్టకిందపల్లిలో గ్రామ సర్వేనెంబరు 545లో సెంట్ స్థలంలో పునాదులపై రేకుల షెడ్డు నిర్మించుకుంది. కొన్ని సంవత్సరాలుగా అక్కడే నివాసముంటోంది. ఆదివారం ఉదయం రాజు, కల్పన, సురేశ్, నాగేంద్రమ్మ మరికొందరు వచ్చి ఎక్స్‌కవేటర్లతో పునాదులతో సహా షెడ్‌ను కూల్చేశారు. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పిడుగుపాటుకు నేలకొరిగిన వృక్షం



ధ్వంసమైన చెట్టు

మడకశిర రూరల్, సెప్టెంబరు 29: మండంలోని గౌడనహళ్లి గ్రామ సమీపంలో పిడుగుపడి పచ్చని చెట్టు ధ్వంసమయింది. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో వర్షం కురిసింది. ఆ సమయంలో ఒక్కసారిగా మెరుపులు, ఉరుములతో కూడిన గట్టి శబ్ధం వచ్చినట్లు స్థానికులు తెలిపారు. గంగమ్మగుడి సమీపంలో పచ్చనిచెట్టుపై పిడుగు పడిందన్నారు. పిడుగు పాటుకు ఆ చెట్టు ధ్వంసమైనట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడికి వెళ్లి పరిశీలించారు.

రైతు మృతి

పావగడ, సెప్టెంబరు 29: తాలూకా పరిధిలోని కొడిగెనహళ్లి గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్(45) ఆదివారం ఉదయం కురిసిన భారీ వర్షానికి పిడుగు పడటంతో పొలంలోనే మృతి చెందాడు. ఉదయం 6 గంటల సమయంలో కురిసిన భారీ వర్షానికి తాలూకా వ్యాప్తంగా వాగులు, వంకలు పొంగిపొర్లగా అధికంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో రెండు మూడు చోట్ల పిడుగు పడ్డాయి. కొన్ని చోట్ల వక్కతోటలు, కొబ్బరిచెట్లు ధ్వంసం కాగా కొడిగెనహళ్లి గ్రామ సమీపంలోని రైతు శ్రీనివాస్ ఎద్దులకొట్టంలో పాడి ఆవులతో పాలు పితుకుతుండగా అక్కడ అకస్మాత్తుగా పిడుగు పడటంతో ఆయన మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ మేరకు అరసికెరె పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుకాగా సంఘటన స్థలానికి రెవిన్యూ అధికారులు తహసీల్దార్ వరదరాజు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి నష్టపరిహారం అందించేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు.



శ్రీనివాస్ (ఫైల్)

విద్యుత్ షాక్‌తో వృద్ధుడికి అస్వస్థత

గోరంట్ల, సెప్టెంబరు 29: పట్టణంలోని కోళ్లఫారంలో పనిచేస్తుండగా ఆదెప్ప అనే వృద్ధుడు విద్యుత్ షాక్‌తో అస్వస్థత గురయ్యాడు. ఆదెప్ప ఆదివారం ఉదయం వర్షం కురవగా తడి చేతులతో స్విచ్‌బోర్డును ముట్టుకోవడంతో విద్యుత్ షాక్ గురై కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అస్వస్థతకు గురయ్యాడు. గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని రాగా ప్రాథమిక చికిత్సలు చేసి, మెరుగైన వైద్యం కోసం బెంగుళూరు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు.

జూదరుల అరెస్ట్

మడకశిర రూరల్, సెప్టెంబరు 29: మండలంలోని జిల్లేడగుంట గ్రామ సమీపంలో జూద కేంద్రంపైదాడి చేసి నగదు, ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రామారావు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఆదివారం మధ్యాహ్నం జిల్లేడుగుంట సమీపంలోని మల్బరీ షెడ్డులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.26,100 నగదు, ఏడు ద్విచక్రవాహనాలు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చోరీకోసం వెళ్లి.. విద్యుదాఘాతంతో మృతి



కాగానిపల్లి వద్ద విద్యుత్ ప్రమాద స్థలంలో మృతదేహం

గోరంట్ల, సెప్టెంబరు 29: మండలంలోని కాగానిపల్లి సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వస్తువులను చోరీ చేస్తుండగా మహబూబ్‌బాషా (41) అనే వ్యక్తి శనివారం రాత్రి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. సోమందేపల్లిలోని షిర్డినగర్‌కు చెందిన గుజీరి వ్యాపారి మహబూబాషా మరికొందరితో కలిసి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగలకొట్టి అందులో విలువైన రాగి వైర్‌ను చోరీలకు పాల్పడేవాడు. కాగినిపల్లి సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్‌ను తొలగిస్తున్న సమయంలో షాక్ గురై అక్కడిక్కడే మృతిచెందాడు. సంఘటన జరిగిన వెంటనే అతడికి తోడుగా వచ్చిన దొంగలు పరికరాలు అక్కడే వదిలి పరారయ్యారు. ఆదివారం తెల్లవారుజామున సోమందేపల్లి నుంచి కొంతమంది సంఘటనా స్థలానికివచ్చి శవాన్ని తీసుకెళ్లే ప్రయాత్నం చేశారు. ఆ సయయంలో పొలం యజమాని చాకలి వెంకటరామప్ప అక్కడికి చేరుకుని వారిని ప్రశ్నించాడు. బహిర్భూమికి వచ్చామని, వారు అక్కడి నుంచి రోడ్డుపైన ఉన్న ఆటోలో వెళ్లిపోయినట్లు తెలిపారు. అనంతరం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పడిఉన్న శవాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఏఎస్ఐ ధనుంజయరెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రకాష్ సంఘటనా ప్రదేశానికి చేరుకుని స్పానర్ల కిట్ స్వాధీనం చేరసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మహబూబ్‌బాషా మృతదేహం

పోటీ పరీక్షలకు ఉపయోగపడని గ్రంథాలయాలు

- ఆసక్తి చూపని డీఎస్సీ అభ్యర్థులు
- పట్టించుకోని అధికారులు

మడకశిరటౌన్, సెప్టెంబరు 29: నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో గ్రంథాలయాలు ఉన్నా వాటిలో పోటీ పరీక్షలకు ఉపయోగపడే కొత్త మెటీరియల్ లేకపోవడం అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారు గ్రంథాలయాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. పాత సిలబస్‌కు సంబంధించిన పుస్తకాలు మాత్రమే ఉన్నాయని, కొత్త సిలబస్‌కు అనుగుణంగా పుస్తకాలను పెడితే నిరుద్యోగులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అంటున్నారు. రెండు సంవత్సరాల క్రితం విడుదలైన నోటిఫికేషన్‌కు సంబంధించిన పుస్తకాలు ఉన్నట్లు లైబ్రేరియన్‌లు చెబుతున్నా అవి తమకు ఉపయోగం లేదంటూ అభ్యర్థులు చెబుతున్నారు. నియోజకవర్గం పరిధిలో అమరాపురం మండల కేంద్రంలో ఉన్న లైబ్రెరీ భవనంపై నీటి ట్యాంకు ఉండటం వల్ల వర్షం వచ్చిన ప్రతిసారీ నీరు నిలబడి 17వేల పుస్తకాలు తడిసిపోతున్నాయని పాఠకులు అంటున్నారు. అందులోనూ లైబ్రరీ ఎక్కడానికి మెటికలు ఉండటం వల్ల సీనియర్ సిటిజన్‌లు వెళ్లలేకపోతున్నారు. లైబ్రరీ ఉన్నా ఉపయోగం సున్నా అన్న చందంగా మారింది. 20 సంవత్సరాలుగా సమస్య ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. రొళ్ల, మడకశిర, అగళి, గుడిబండ మండలాల్లో సొంత భవనాలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రంథాలయాల్లో పాఠకులకు అనుగుణంగా పుస్తకాలను ఉంచాలని కోరుతున్నారు.



అమరాపురం లైబ్రరీపై ఉన్న ట్యాంకర్

నూతన సిలబస్ పుస్తకాలు ఉండాలి



అమరాపురం గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు వెళితే పాత సిలబస్‌తో కూడిన పుస్తకాలు ఉన్నాయి. కొత్త సిలబస్ పుస్తకాలు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. ఏప్రిల్ మాసంలో పరీక్షలు ఉండగా వాటికి అనుగుణంగా గ్రంథాలయంలో పుస్తకాలు ఉంచితే అందరికీ ఉపయోగం. **-రంగారెడ్డి, డీఎస్సీ అభ్యర్థి, అమరాపురం**



గ్రంథాలయంలో సిద్ధంగా ఉంచిన పుస్తకాలు

సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లాం

గ్రంథాలయంపై ట్యాంకు ఉండటం వల్ల సమస్య ఉన్న మాట వాస్తవమే. పంచాయతీ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లాం. తహసీల్దార్, ఎంపీడీఓల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. గత గ్రూప్-2కు అనుగుణంగా లైబ్రరీలో మెటీరియల్ అందుబాటులో ఉన్నాయి. పాఠకులకు అవసరమైన పుస్తకాలు సమకూర్చేందుకు ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళుతున్నాం.

-ఇబ్రహీం, లైబ్రేరియన్, అమరాపురం